క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, పీఈటీ షబాన

పరిగి: మండలంలోని ఏపీఆర్‌ఎస్ కొడిగెనహళ్లి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు తెలిపారు. శనివారం స్థానిక పాఠశాలలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థి రితీష్‌కుమార్, 7వ తరగతి విద్యార్థి సాంబశివ జిల్లా స్థాయిలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో ప్రతిభ కనబరచాలన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఇద్దరు విద్యార్థులు ఈనెల 2న మంగళగిరిలోని 6వ ఏపీఎస్పీ బెటాలియన్ గ్రౌండ్స్‌లో జరిగే అథ్లెటిక్స్‌లో పాల్గొంటారన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

లేపాక్షి: శిరివరం కోడిరంగనాథస్వామి ఆలయ అభివృద్ధి లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ శనివారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులకు రూ. 25 వేలు అందించారు. కోడిరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయానికి రంగులు వేయాలని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి నగదు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



జ్యోతులను తీసుకెళ్తున్న భక్తులు

అమరాపురం: ఉదుగూరు గ్రామంలో ఆంజనేయస్వామి, కెంచమాంబ దేవికి శనివారం జ్యోతుల ఉత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రాణ ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం వివిధ రకాల అభిషేకాలు చేసి పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం మహిళలు పిండితో తయారు చేసిన హారతులతో డప్పు వాయిద్యాలతో వీధుల్లో ఊరేగించారు. ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకుని అక్కడ ప్రదక్షిణల అనంతరం హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడి నుంచి కెంచమాంబ ఆలయం వద్దకు చేరుకుని అమ్మ వారికి హారతులిచ్చారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై విచారణ

పరిగి: పైడేటిలో కొంతకాలంగా నెలకొన్న అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు స్థలాన్ని శనివారం తహసీల్దారు హసీనా సుల్తానా పరిశీలించారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు స్థలం చూపాలని ఎస్సీ కాలనీవాసులు అధికారులను కోరారు. అదే ప్రదేశంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటును బీసీలు వ్యతిరేకించారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్, ఆర్ఐ సిద్దేశ్వర్ ఇరు వర్గాల వారితో చర్చించారు. వారిద్దరి సమ్మతి మేరకు చిన్న సైజులో అంబేడ్కర్, గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

'ఉపాధి'పై ప్రజావేదిక



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ శివశంకర్

అగళి: ఉపాధి పనులపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. అడిషనల్ పీడీ శివశంకర్, ఏపీడీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి పథకం, పంచాయతీరాజ్ శాఖలో పూర్తి చేసిన 578 పనులకు రూ.5.36 కోట్లు ఖర్చు పెట్టారు. చేపట్టిన పనులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని వారం రోజులుగా డీఆర్పీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఉపాధి పథకంలో రూ.97,000 నిధులు దుర్వినియోగం అయినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ ఆవులయ్య, డీఆర్ఓ రామాంజనేయరెడ్డి, పీఈ నగేశ్వర్, ఎంపీడీఓ యాదవేంద్ర, ఏపీఓ శివన్న, డీఆర్పీలు పాల్గొన్నారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు

పావగడ: మైక్రో ఫైనాన్స్ సంసలు బలవంతంగా రుణ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వరదరాజు హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఒక వ్యక్తికి రూ.3 లక్షల చొప్పున నాలుగు సార్లు తక్కువ వడ్డీతో రుణాలు అందివ్వాలన్నారు. సీఐ సురేశ్ తదతరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన యజ్ఞం

- సైకిల్‌షాపు నిర్వాహకుడి సేవ
- రోజూ వందలాదిమందికి అన్నదానం

హిందూపురం: ఓ వ్యక్తి చొరవ వందలాది మంది కడుపు నింపుతోంది. ఆదరణకు నోచుకోని ఎందరో అభాగ్యులు అతడి సేవాగుణంతో క్షుద్బాధను తీర్చుకుంటున్నారు. ఆ వ్యక్తి చేపట్టిన మహత్కార్యానికి మరికొందరు తోడవడంతో అన్నదానం కాస్త నిత్యాన్నదాన యజ్ఞంగా మారింది. వివరాల్లోకెళితే.. పట్టణానికి చెందిన సైకిల్‌షాపు నిర్వహకులు రవికుమార్ సద్గురు యోగి నారాయణ సేవాసమితి పేరుతో పదేళ్లుగా వేసవిలో పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చేవాడు. అయితే రోజువారి కూలీలు, అనాథలు, ప్రయాణికులు ఒకపూట భోజనం కోసం పడుతున్న ఇబ్బందులు గుర్తించి అన్నదానం ఏర్పాటు చేయాలని సంకల్పించాడు.

రైల్వేరోడ్డు కేంద్రంగా

రవికుమార్ అనుకున్నదే తడవుగా సద్గురు యోగి నారాయణ సేవాసమితి ఆధ్వర్యంలో రైల్వేరోడ్డు కేంద్రంగా తొమ్మిది నెలల క్రితం సొంత డబ్బుతో అన్నదానాన్ని ప్రారంభించాడు. అయితే ఆయన చేపడుతున్న కార్యక్రమాన్ని గుర్తించిన మరికొందరు దాతలు బియ్యం ప్యాకెట్లు, వంటనూనెలు, ఇతర సామగ్రిలు అందిస్తూ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నారు. రోజూ పప్పన్నం, సాంబారుతోపాటు ఒక తీపి పదార్థం వడ్డిస్తున్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా అన్నదానం కాస్త యజ్ఞంగా మారింది. ప్రస్తుతం రోజూ 400 మందికి అన్నదానం చేస్తున్నారు.



అన్నదానం చేస్తున్న రవికుమార్



వేసవిలో శీతల పానీయాలు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

వేసవిలో చలివేంద్రాలు..

వేసవిలో పట్టణంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ప్రజలు ఎండవేడిని తట్టుకోలేక పోతుంటారు. దప్పిక తీర్చుకోవడానికి నీళ్లు, పానీయాలు తాగడానికి ప్రయాసపడుతుంటారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన రవికుమార్ పట్టణంలోని అన్ని ప్రధాన రహదారుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రైల్వేరోడ్డులోని తన సైకిల్‌షాపు వద్ద వేసవిలో రోజూ దాదాపు 500 మందికి మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు మజ్జిగ, ఆరంజ్, మ్యాంగో, పైనాపిల్ తదితర పానీయాలు కూడా పంపిణీ చేస్తుంటారు.

ఎంతో మంది ఆకలి తీర్చుతున్నారు



రవికుమార్ నిత్యాన్నాదానం కార్యక్రమం ద్వారా ఎంతోమంది ఆకలి తీర్చుతున్నారు. దాతల సహకారంతో మంచి కార్యక్రమం కొనసాగుతోంది. చాలా మంది అనాథలు, ప్రయాణికులు మధ్యాహ్న సమయంలో ఇక్కడ భోజనం చేస్తూ సంతృప్తి చెందుతున్నారు. ఇలాంటి కార్యక్రమాలకు దాతలు సహకరించాలి.

– చంద్ర, హిందూపురం

సేవతోనే ఆత్మ సంతృప్తి



ఇతరులకు సేవ చేయడంతో నాకు ఆత్మ సంతృప్తి లభిస్తోంది. చిన్నగా మొదలైన అన్న,పానీయాల దానం దాతలు, కమిటీ సభ్యులు, సన్నిహితుల సహకారంతో బృహత్కార్యంగా మారింది. హిందూపురం ప్రాంతంలో నిత్యదానసత్రం నిర్మించాలనే సంకల్పంతో ముందుకుపోతున్నాం. ఇందుకు ప్రభుత్వం సహకరించి స్థలాన్ని కేటాయించాలని కోరుతున్నాం.

– రవికుమార్, యోగి నారాయణ సేవాసమితి అధ్యక్షుడు

'ఫీజు పోరు' విజయవంతం చేయండి

మడకశిర: జిల్లా కేంద్రంలో ఈనెల 5న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఫీజు పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులకు రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని పట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో సకాలంలో విద్యార్థులకు వసతి దీవెన, విద్యాదీవెన పథకాలు అందినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పార్టీ ఆదేశాలను తప్పకుండా పాటించాలి



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న వేణురెడ్డి

హిందూపురం: మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లందరూ పార్టీ ఆదేశాలను పాటించాలని ఆ పార్టీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి కోరారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను కొనుగోలు చేసేందుకు ఎత్తులు వేస్తోందని, కౌన్సిలర్లు అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రజలు నమ్మి ఓటేసి వారిని నమ్మకాన్ని అమ్ముకానికి పెట్టొద్దని హితవు పలికారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో పార్టీ విప్ జారీ చేయనుందని పార్టీ కౌన్సిలందరూ ఏకతాటిపై నిలిచి పార్టీ నిర్ణయించిన సభ్యుడిని గెలిపించాలని కోరారు. కౌన్సిలర్లు విప్ ధిక్కరిస్తే వేటు తప్పదనే విషయాన్ని అధిష్టానం స్పష్టంగా చెప్పిందని వేణురెడ్డి తెలియజేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

అమరాపురం: సినీ నటుడు కృష్ణ పేరుతో ముద్రించిన క్యాలెండర్లను శనివారం ఎంపీటీసీ నారాయణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శివకుమార్, కృష్ణ అభిమానులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కృష్ణ క్యాలెండర్లు విజయవాడ నుంచి వస్తాయని తెలిపారు. తాము కృష్ణ అభిమానులమని.. క్యాలెండర్లను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణ అభిమానులు కెఎస్.తిప్పేస్వామి, చిత్తప్ప, బసన్న, గాదీరప్ప, నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో 'స్వచ్ఛ సేవ'



పరిసరాలను శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు

పావగడ: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యకర జీవితాన్ని సాగించవచ్చని స్థానిక జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి.మాదేశ్ అన్నారు. జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోర్టు ఆవరణలో స్వచ్ఛ సేవ కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తులు వి.మాదేశ్, బి.ప్రియాంక చీపురు చేత బట్టి కోర్టు ఆవరణలో చెత్త ఊడ్చి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషానందన్, కార్యదర్శి ప్రభాకరరెడ్డి, ఏపిపి సన్నీరప్ప తదితర న్యాయవాదులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వీరకేతమ్మ ఉత్సవాలు ప్రారంభం



జ్యోతుల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

మడకశిర రూరల్: కల్లుమర్రి సమీపంలో వెలిసిన వీరకేతమ్మ దేవత ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే అర్చకులు అమ్మవారికి కలశస్థాపన, కల్యాణోత్సవం, ధ్వజరోహణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు. మాజీ మంత్రి రఘువీరారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కమిటీ సభ్యులు ఆయన్ను శాలువాతో సన్మానించారు. అర్చకులు భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నాగదేవతా హోమం, చండీయాగం, మధ్యాహ్నం అమ్మవారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

బీజేపీ నేత షెడ్డు తొలగింపులో ఉద్రిక్తత



షెడ్డు తొలగించొద్దని రెవెన్యూ అధికారులను వేడుకుంటున్న కిష్టప్ప కుటుంబ సభ్యులు

గోరంట్ల: ఖాజాపురానికి చెందిన బీజేపీ నాయకుడు గొల్ల కిష్టప్ప నిర్మించిన షెడ్డు తొలగింపుతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. వివరాలు.. దివ్యాంగుడైన గొల్ల కిష్టప్ప కుటుంబానికి మందలపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 272లో పట్టా భూమి ఉంది. అతని కుటుంబ సభ్యులు 40 ఏళ్ల నుంచి 272 సర్వేనంబర్‌కు పక్కనే ఉన్న 268 సర్వే నంబర్ పోరంబోకు భూమి సాగు చేస్తున్నారు. గతేడాది కిష్టప్ప రస్తా పోరంబోగు స్థలం నాలుగు సెంట్లతో షెడ్డు నిర్మించాడు. ఇదే రస్తా పోరంబోకు భూమిలో గ్రామానికి చెందినవారు కొంత ఆక్రమించి, షెడ్డు, వ్యవసాయ అవసరాలకు వాడుకుంటున్నారు. కిష్టప్ప నిర్మించిన షెడ్డును తహసీల్దార్ మారుతీ ప్రసాద్, రెవెన్యూ అధికారులు శనివారం ఉదయం తొలగించడానికి వెళ్లగా కిష్టప్ప, ఆయన భార్య కిష్టమ్మ అడ్డుకున్నారు. కిష్టప్ప కుటుంబ సభ్యుల మాటలు ఖాతరు చేయకుండా రెవెన్యూ అధికారులు షెడ్డు తొలగించేందుకు పూనుకోగా, అతను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. దీంతో రెవెన్యూ అధికారులు బాధితుడికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఇదే సమయంలో కిష్టప్ప భార్య కిష్టమ్మ కూడా షెడ్డులోపలికి వెళ్లి తలుపులు మూసి, షెడ్డు తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. దీంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వారితో మాట్లాడి, శాంతింపజేశారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వగా, ఎట్టకేలకు షెడ్డును రెవెన్యూ అధికారులు తొలగించారు. రెవెన్యూ అధికారులు మందలపల్లి ఖాజాపురంలోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లను కూడా తొలగించకపోతే న్యాయ పోరాటానికి దిగుతామని కిష్టప్ప కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. ఖాజాపురానికి చెందిన దివ్యాంగుడు కిష్టప్ప ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షెడ్డును తొలగించడం ముమ్మాటికీ రాజకీయ కక్షసాధింపేనని పలువురు అభిప్రాయ పడ్డారు.

13వ వ్యవస్థాపక దినోత్సవం

హిందూపురం టౌన్: పట్టణంలోని డీబీడీబీఎస్ చిన్మయ విద్యాలయంలో శనివారం 13వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విద్యాలయ వ్యవస్థాపకుల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థి బృందం, ఉపాధ్యాయులు పథ సంచలనం, సాంస్కృతిక కార్యక్రమాలతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యాలయ కరస్పాండెంట్ భీమరాజు, ట్రెజరర్ రఘునందన్ గుప్తా, చిన్మయా మిషన్ ప్రెసిడెంట్ మల్లికార్జున, ప్రిన్సిపాల్ సరళ, వైస్ ప్రిన్సిపాల్ మహేష్ బాబు, ఆఫీస్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేద్దాం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ కోరారు. శనివారం స్థానిక వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు, అర్చకులు, దేవదాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు ఈనెల 25 మార్చి 1 వరకు లేపాక్షిలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉత్సవాల రోజుల్లో భక్తులందరికీ సులువుగా స్వామి దర్శనమయ్యేలా చూస్తామన్నారు. కానుకలను హుండీలో వేసేలా అక్కడక్కడ స్కానర్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ ఏడాది కాలసర్పదోష నివారణ పూజలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలు జరిగే 5 రోజులు అన్నదానం, ప్రసాదాలు పంపిణీ చేస్తామని తెలిపారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లోనే రావాలని సూచించారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆలయ ఈఓ నరసింహమూర్తి, దేవదాయ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆర్.అనంతపురంలో కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు

మడకశిరరూరల్: ఆర్.అనంతపురంలో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రం, నూతనంగా నిర్మించిన సోసైటీ గోదామును ఎమ్మెల్యే ఎంఎస్ రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంది రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆర్.అనంతపురం, సి.రంగాపురం, అయ్యవారిపల్లి గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, డీసీఓ కృష్ణానాయక్, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ సోమశేఖర్, సీఈఓ సురేష్, సొసైటీ యూనియన్ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి హరికృష్ణ, ఏడీ కృష్ణమీనన్ పాల్గొన్నారు.

మడకశిర: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు డాక్టర్లు, వైద్య సిబ్బందిని కోరారు. శనివారం మడకశిర ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. వివిధ వార్డులను సందర్శించి రోగులకు ఎలా వైద్య సేవలందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిపై ఆరోపణలు చేస్తే సహించం



మాట్లాడుతున్న రవిశేఖర్‌రెడ్డి

మడకశిర: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించబోమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ మంత్రిపై ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తోందని విమర్శించారు. రాజకీయ కక్షతో వేధింపులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా విఫలమాయ్యరన్నారు. ఈ హామీల నుంచి ప్రజలను డైవర్షన్ చేసేందుకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూములను ఆక్రమించుకున్నారంటూ తప్పుడు ప్రచారాన్ని మొదలు పెట్టారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి అటవీ భూములను ఆక్రమించుకోలేదన్నారు. అక్రమంగా అటవీ భూములను ఆక్రమించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

పెద్దిరెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు

గుడిబండ: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూములను కబ్జా చేశారని కూటమి ప్రభుత్వం అవాస్తవాలను ప్రచారం చేయడం సరికాదు. నిజాలు ఉంటే నిరూపించాలని నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే 1981లో ఆ భూములపై కమిటీ ఏర్పాటు చేసి పరిశీలించగా.. ఆ భూములు ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించివిగా నిర్ధారించారు. అయితే ఆ భూములకు సంబంధించి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడూ చంద్రబాబు నాయుడు కమిటీలను ఏర్పాటు చేసి రెవెన్యూ, అటవీ అధికారులతో సర్వే చేయించగా అవి ప్రభుత్వ భూములు కావని నిర్ధారించిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఎలాగైనా మాజీ మంత్రిపై కుట్రలు పన్ని ప్రజల దృష్టిలో దోషిగా నిలపాలని చేస్తున్న చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు.

డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య

హిందూపురం టౌన్: ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్యనందిస్తున్నామని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటేషులు తెలిపారు. శనివారం కళాశాలలో ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీలో చేరబోయే ఇంటర్ విద్యార్థులు కళాశాలలోని ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడల విభాగం, లాంగ్వేజ్ ల్యాబ్, జేకేసీ సెల్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర విభాగాలను సందర్శించారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు వారికి కళాశాలలో అందుతున్న సౌకర్యాలను తెలియజేశారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. సువర్ణ భారతి కళాశాల అధ్యాపకులు రాఘవేంద్ర, చిలమత్తూరు జూనియర్ కళాశాల అధ్యాపకులు తదతరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

పెనుకొండ: విద్యారంగాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 117 జీఓ ఫలితంగా విద్యారంగం అస్తవ్యస్తంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే ఈ దీన్ని సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా అసలు పీఆర్‌సీ ప్రకటించలేదని, ఐఆర్ ఊసే లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ. 25 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. నాయకులు భూతన్న, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

రొళ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు విద్యా, ఉద్యోగ, ఉపాధి ఇతరాత్ర రంగంలో అభివృద్ధి చెందినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ పేర్కొన్నారు. శనివారం మల్లినమడుగు గ్రామంలోపర్యటించారు. గ్రామంలో దాదాపు రూ.26 లక్షలతో లక్ష్మీదేవి, నరసింహస్వామి ఆలయాన్ని నిర్మించడం సంతోషకరమన్నారు. ప్రతి నిరుపేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాది నాగార్జున, రామాంజినప్ప, రవికుమార్, జగదీష్, తిప్పేస్వామి, రంగా, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు

హిందూపురం: స్థానిక డిపో నుంచి మహాకుంభ మేళ యాత్రకు ఈనెల మొదటి వారం నుంచి ప్రత్యేక సర్వీసు ఏర్పాటు చేసినట్లు డీఎం శ్రీకాంత్ తెలిపారు. మహా కుంభమేళా అయోధ్య, కాశీ యాత్ర టికెట్ కావాల్సిన వారు 9440834715, 7382861323 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి

పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని వెంకటాపురం తండాలో మంత్రి సవిత శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ప్రతి నెలా పింఛన్‌దారులకు రూ.4 వేలు పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇంటి వద్దకే వచ్చి సిబ్బంది పింఛన్ అందిస్తున్నటుల తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి

మడకశిర: పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును ప్రభుత్వం వ్యతిరేకించాలని నియోజకవర్గ ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు వసీమ్‌బేగ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలు వ్యతిరేకించేలా చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. ముస్లింలకు అండగా నిలబడాలని కోరారు. ఈనెల 5న వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా విజయవాడలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పరిగి: జిల్లాలోని వెనుకబడిన కులాలకు చెందిన అర్హులైన వారు రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, రెడ్డీ, కమ్మ కులాలకు చెందిన వారు ఈనెల 7 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మండలంలోని పరిగి కెనరా బ్యాంకు పరిధిలో – 17, పరిగి కెనరా బ్యాంకు పరిధిలో – 17, హిందూపురం ఏడీబీ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) పరిధిలో – 13 యూనిట్లు ఉన్నట్లు తెలిపారు.

వంక ఆక్రమణపై విచారణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ నగర్‌లో వంక ఆక్రమణపై ఆర్డీవో ఆనంద్‌కుమార్ శనివారం విచారణ జరిపారు. ఇటీవల జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు మంత్రి సవితకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు వంక ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో సర్వే చేస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు.